● వైసీపీలో నీటి'నిప్పు'

మానాలు తీస్తివిగదా జగనన్నా!

- నీళ్లు తోలి అప్పులపాలైన 'అధికార' శ్రేణుల ఆక్రోశం
- బిల్లులు చెల్లిస్తావా, మమ్మల్ని వదిలేసుకుంటావా?
- సర్పంచుల అల్టిమేటం
- ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముట్టడి

కుప్పం వైసీపీలో నీటి నిప్పులు రగులుతున్నాయి. బిల్లుల కోసం ఇన్నేళ్లుగా నిరీక్షించిన అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు.. ఒక్కసారిగా భగ్గుమంటున్నారు. ఆవేదనా స్వరం వినిపిస్తున్నారు. ప్రభుత్వ తీరుతో తలెత్తిన ఈ పరిణామాలు ఎటు దారి తీస్తాయోనని అధికార పార్టీలో ఆందోళన రేకెత్తిస్తోంది. - కుప్పం





ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం - ఎమ్మెల్సీ భరత్ కార్యాలయం ముందు అధికార పార్టీ శ్రేణుల నిరసన

వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కరువు పరిస్థితుల్లో గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. వీరిలో అత్యధికులు వైసీపీకి చెందిన వారే. వీరిలో కొందరు ప్రస్తుతం సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు కూడా. తొలి మూడు నెలలు బిల్లులు వచ్చాయి. ఆ తర్వాత పెండింగులో పడ్డాయి. ఇలా కుప్పం నియోజకవర్గంలోని నాలుగు.. పలమనేరు నియోజకవర్గంలోని వి.కోటతో కలిపి ఐదు మండలాల్లో రూ.17 కోట్ల బకాయిలు నాలుగున్నరేళ్లుగా పేరుకుపోయాయి. మిగతా జిల్లాల్లో తాగునీటి సరఫరా బిల్లులు ఇచ్చి.. ఒక్క చిత్తూరు జిల్లాకే అన్యాయం చేశారని అధికార పార్టీ శ్రేణులు అంటున్నాయి. ఈ బిల్లుల కోసం వీరు మూడునాలుగు నెలల ముందు రెండు దఫాలుగా కుప్పంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. బిల్లులపై అప్పట్లో ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. సుమారు నెల కిందట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వాహనాన్ని అడ్డుకున్నారు. సీఎంతో మాట్లాడి చెల్లించేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు శాంతిపురం మండల వైసీపీ కార్యకర్తల సమావేశంలోనూ సర్పంచులు, ఇతర నాయకులు వెలుపలకు వచ్చి నిరసన తెలిపారు. సీఎంతో మాట్లాడించి బిల్లుల క్లియరెన్స్‌కు ప్రయత్నిస్తానని అదే సమావేశంలో ఉన్న ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప హామీ ఇచ్చారు. ఆ మేరకు కొద్దిమంది సర్పంచులను ఎమ్మెల్సీ విజయవాడ తీసుకెళ్లినా సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించలేకపోయారు. ఇలా.. దాదాపు ఏడుసార్లు నీటి బిల్లుల కోసం అధికార పార్టీ శ్రేణులు ధర్నాలు, ఆందోళనలు చేశాయి. ప్రతి సారీ ఒక తేదీ చెప్పి, ఆలోగా చెల్లించేలా చూస్తామని నాయకులు హామీ లిస్తూ వచ్చారు.

సహనం నశించి.. కార్యాలయం ముట్టడించి

ఈ ప్రభుత్వ పదవీ కాలం ముగుస్తున్నా బిల్లులు రాకపోవడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల్లో సహనం నశించింది. బిల్లులు రాక, అప్పులోళ్ల బాధ పడలేక మంగళవారం వీరంతా కుప్పంలోని ఎమ్మెల్సీ భరత్ ఇంటికి చేరుకున్నారు. సీఎం జగన్‌రెడ్డి పర్యటన మూడునాలుగు రోజుల్లో ఉందని, ఆలోగా బిల్లులన్నీ చెల్లించేస్తారని ఎమ్మెల్సీ చెప్పిన మాటలు వారు వినలేదు. 'సీఎం వస్తేనే బిల్లులు ఇస్తారా? లేకపోతే ఇవ్వరా?' అంటూ ఆయన్ను నిలదీశారు. ఇక మీ మాటలు నమ్మేది లేదని తాడోపేడో తేల్చుకుంటామని నేరుగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఉద్యోగులను బయటకు పంపి తాళాలు వేశారు. నీటి బిల్లులు చెల్లించాలంటూ నినాదాలు చేశారు.

ఆవేదన

నాయకులు, అధికారుల మాటలు నమ్మి అప్పులు చేసి గ్రామాలకు నీటిని తోలినాం. నాలుగున్నరేళ్లుగా బకాయిలు చెల్లించలేదు. అప్పులోళ్లు ట్యాంకర్లు, ట్రాక్టర్లు ఆఖరికి టూ వీలర్లు కూడా పట్టుకుపోయారు. దీంతో మా మానాలు ఎప్పుడో పోయాయి. ప్రాణాలు ఒక్కటే మిగిలినాయి. అవి కూడా తీసుకోవాలనుకుంటున్నావా జగనన్నా?

ఆగ్రహం

ఇదిగో, అదిగో అంటూనే ఉండారు. నాలున్నరేళ్లగా ఇదే తంతు. మేము పెట్టిన డెడ్‌లైన్ మించిపోయింది. మమ్మల్ని ఇంక ఎవరు అడ్డుకుంటారో చూస్తాం. మాకు నీటి బకాయిలు చెల్లిస్తారా లేకపోతే మమ్మల్ని వదిలేసుకుంటారా? మీరే చెప్పండి సీఎం సారూ.

వైసీపీలో గుబులు

గతంలో చాలాసార్లు ఆందోళనలు చేసినా కెమెరాల ముందుకు వచ్చి నాయకులకు, సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడడానికి వీరు జంకేవారు. కేవలం అధికారులను నిలదీసి వెళ్లిపోయే వారు. కానీ మంగళవారంనాడు మాత్రం నాయకుల తీరును ఎండగట్టారు. 'బిల్లులు ఇస్తారా? మమ్మల్ని వదులుకుంటారా?' అంటూ అల్టిమేటం ఇచ్చారు. నాలుగున్నర లక్షలు పెట్టి కొన్న కారును కూడా అప్పులోళ్లకు ధారాదత్తం చేయాల్సి వచ్చిదంటూ కన్నీళ్ల పర్యంతమైన ఒక పంచాయతీ స్థాయి నేత అయితే.. తమ కుటుంబాల మానాలు పోయాయని ప్రాణాలు కూడా కావాలా అని ఆక్రోశం వెళ్లగక్కారు. 'మేము పెట్టిన డెడ్ లైన్ ముగిసిపోయింది. ఏమి చేసుకుంటారో చేసుకోండి. నామీద కేసు కూడా ఉంది. మీకు భయపడేది లేదు. ఆందోళన ఆపేది లేదు' అంటూ మరో నేత ఆగ్రహంతో ఊగిపోయారు. ఈ పరిణామాలు వైసీపీలో గుబులు రేపుతున్నాయి. బిల్లులు చెల్లించకపోతే వీరంతా పార్టీ వీడే పరిస్థితి ఏర్పడి మునిగిపోయే ప్రమాదం ఉందని నియోజకవర్గ నాయకత్వం ఆందోళన చెందుతోంది. అయితే ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని లోలోపలే బీతిల్లుతోంది.

డీకే కుటుంబంలో ఎవరు ఎటు?

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులు కుటుంబీకులు ఒక్కొక్కరు ఒక్కో పార్టీలో కనిపిస్తున్నారు. ఆయన కుమారుడు డీఏ శ్రీనివాస్ జనవరి ఒకటో తేదీన అందరికీ విందు ఏర్పాటుచేసి వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానని చెప్పి వెళ్లిపోయారు. ఇక, కుమార్తె తేజస్విని రా కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి వేదిక పంచుకున్నారు. ఆయన మనవరాలు చైతన్య జనసేనలో చేరి.. ఆ పార్టీ చిత్తూరు అభ్యర్థి తానేనని చెప్పుకొంటున్నారు. చిత్తూరు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన డీకే కుటుంబం.. ఇప్పుడు గందరగోళానికి తావిస్తోంది. వీరిలో ఎవరు.. ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారు.. అసలు పోటీ చేస్తారా, లేదా అనే అయోమయంలో చిత్తూరు వాసుల్లో నెలకొని ఉంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అన్ని పార్టీలతో టచ్‌లో శ్రీనివాస్

గతేడాది డిసెంబరు చివర్లో చిత్తూరు నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న డీఏ శ్రీనివాస్ వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానని ప్రకటించారు. దీనికి అనుగుణంగా జనవరి ఒకటో తేదీన చిత్తూరులోని తన స్వగృహంలో ప్రముఖులకు విందు ఏర్పాటు చేశారు. టీడీపీ నేత కాజూరు బాలాజీ వేసిన పసుపు కండువాను కాసేపు మెడలో ఉంచుకున్నారు. ఆయన కండువా వేసుకోవడంతో పాటు, ఆయన చిన్నాన్న బద్రినారాయణ టీడీపీ కార్యక్రమాల్లో నిత్యం పాల్గొంటుండటం, జనవరి 1న విందుకు టీడీపీ నాయకులనే ఆహ్వానించడంతో.. శ్రీనివాస్ టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తారని అంతా భావించారు. అంతలోనే ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోను, కొన్నాళ్లకు మంత్రి పెద్దిరెడ్డితో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో కొన్నాళ్లపాటు ఆయన వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరిగింది. వీటన్నింటినీ ఆయన పటాపంచలు చేస్తూ ఏ పార్టీ వైపూ వెళ్లకుండా సైలెంట్ అయిపోయారు. ప్రస్తుతానికి ఆయనకు రాజకీయాల మీద ఆసక్తి లేదని సమాచారం.



మంత్రి పెద్దిరెడ్డితో డీఏ శ్రీనివాస్

టీడీపీలో కూతురు తేజస్విని

ఇటీవల జీడీనెల్లూరులో జరిగిన రా కదలిరా సభలో ఆదికేశవులు కుమార్తె తేజస్విని పాల్గొన్నారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. వేదికపై ఆశీనులయ్యారు. ఆమె చిత్తూరు టికెట్ ఆశించే చంద్రబాబును కలిశారని టీడీపీ నాయకులు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా బుధవారం ఆమెను కలిసేందుకు చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. చిత్తూరులోని కొందరు ప్రముఖ నాయకులతో ఆమె నేడు చంద్రబాబును కలవనున్నారు. కుటుంబ నేపథ్యం దృష్ట్యా తేజస్వినికి చంద్రబాబు ప్రాధాన్యతనిస్తారని టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నేటి భేటీ తర్వాత చిత్తూరు టీడీపీలో సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



జీడీనెల్లూరులో చంద్రబాబుతో తేజస్విని

జనసేనలో మనవరాలు చైతన్య

ఆదికేశవులు మరణానంతరం ఆయన సతీమణి సత్యప్రభ 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీచేశారు. కరోనా సమయంలో ఆమె కన్నుమూశారు. 2019 తర్వాత నుంచి ఆ కుటుంబ సభ్యులు చిత్తూరుకు, రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తొలుత ఆదికేశవులు మనవరాలు చైతన్య గతేడాది డిసెంబరు చివర్లో జనసేనలో చేరారు. అప్పటి నుంచి చిత్తూరు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి తానేనని చెప్పుకుంటూ ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేసుకుంటున్నారు. ఆ పార్టీ నాయకులతో సమావేశమవుతున్నారు. జనసేన అధిష్ఠానం నుంచి మాత్రం ఈమె విషయంలో ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.



పవన్‌కల్యాణ్‌తో చైతన్య

'ఎన్నికల' బదిలీ..!

- ఆళ్లగడ్డకు ట్రాన్స్‌ఫర్ చేసినా చేరని వైనం
- చిత్తూరు ఎస్‌బీ డీఎస్పీగా వెనక్కి
- పట్టుబట్టి సుధాకర్‌రెడ్డిని వేయించుకున్న అధికార పార్టీ పెద్దలు



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడేళ్లు పనిచేసిన అధికారులు.. పక్క జిల్లాలకు బదిలీ కావాలి. లేదా ఎన్నికలకు సంబంధంలేని లూప్ లైన్‌కు పంపాలి. ఈ నిబంధనల మేరకు పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ చేశారు.

బదిలీ అయి వారం రోజులైనా ఆయన అక్కడ చేరలేదు. మళ్లీ, మంగళవారం చిత్తూరు స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా సుధాకర్‌రెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీ ఎన్నికల్లో అధికార పార్టీకి మేలు కోసమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఎందుకంటే.. వైసీపీ అధికారంలోకి వచ్చాక డీఎస్పీ సుధాకర్‌రెడ్డి వివాదాస్పద అధికారిగా పేరుపొందారు. పలమనేరు రెగ్యులర్, కుప్పం ఇన్‌చార్జి డీఎస్పీగా ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలకు తావిచ్చాయి. చంద్రబాబు అరెస్టు సమయంలో పలమనేరు, గంగవరంలో ప్రైవేటు స్థలాల్లోనూ టీడీపీ నిరసనలు చేయనీయకుండా అడ్డుకున్న విషయాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. చంద్రబాబు పర్యటన.. లోకేశ్ యువగళం పాదయాత్రలోనూ అడుగడుగునా ఆంక్షల పేరిట అడ్డుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలను పాటిస్తారనే విమర్శలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో పోలీసు రాజ్యం నడుస్తుందని, అక్రమ కేసులతో ప్రతిపక్షాలను వేధిస్తున్నారంటూ ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రయోజనం కోసమే డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని లూప్‌లైన్ సాకుతో చిత్తూరు ఎస్బీకి బదిలీ చేయించారనే ప్రచారం జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు/ చిత్తూరు

నేటి నుంచి ఉద్యోగుల ఆందోళన బాట



విలేకరులతో మాట్లాడుతున్న రాఘవులు

చిత్తూరు, ఫిబ్రవరి 13: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు హెచ్చరించారు. చిత్తూరులోని ఎన్‌జీవో భవనంలో మంగళవారం ఆయన సంఘ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 30శాతం ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండరు లీవు, జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్, సీపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బుధవారం ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపడతామన్నారు. 15న భోజన విరామ సమయంలో నిరసన, 17న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసనలు, ర్యాలీలు, 20న జిల్లాకేంద్రంలో ర్యాలీ, ధర్నా ఉంటుందన్నారు. 21 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్ర నాయకులు జిల్లాలో పర్యటిస్తారన్నారు. 27న విజయవాడలో ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొనాలని ఆయన కోరారు. ఏపీ జేఏసీ కార్యదర్శి రఘు, నేతలు రమణ, చెంగల్రాయమందడి, భానుప్రకాష్, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తంరెడ్డి, ప్రదీప్ కుమార్, రమేష్, మహేష్, మురళి తదిరులు పాల్గొన్నారు.

గంజాయి, శ్రీగంధం విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గంగవరం, ఫిబ్రవరి 13: గంజాయి, శ్రీగంధం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. గంగవరం పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంగవరం పరిసర ప్రాంతాల్లో గంజాయి, శ్రీగంధం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రొంటకుంట్ల రోడ్డు సరస్వతీనగర్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో రెవిన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా జిలానీ బాషా ఇంటివద్ద దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో పట్టుబడిన సరస్వతీనగర్‌కు చెందిన జిలానీ బాషా, కెజీసత్రంకు చెందిన ఎం.కుమార్, పెద్దపంజాణిమండలం పెద్దకాపల్లికి చెందిన నిమ్మనపల్లి శేఖర్‌ను విచారించగా, గంజాయి, శ్రీగంధం గుట్టు బయటపడిందన్నారు. ఈ ముగ్గురు కలిసి గంజాయి, శ్రీగంధం విక్రయించి ఆ డబ్బుతో జల్సాలకు అలవాటుపడ్డారన్నారు. జిలాని బాషాకు అతడి కుమారుడే గంజాయి తీసుకొచ్చి అందించి, విక్రయించడానికి సహకరిస్తుండడంతో అతడిపైనా కేసు నమోదు చేశామన్నారు. జిలానీబాషా ఇంటివద్దే గంజాయి మొక్కలు పెంచుతున్నాడన్నారు. ముగ్గురు నిందితులతో పాటు, కిలో గంజాయి, 2.9 కిలోల శ్రీగంధంను సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

సీఎం సభకోసం స్థల పరిశీలన!

శాంతిపురం, ఫిబ్రవరి 13: శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె సమీపంలోని హెరిటేజ్ వద్ద ఉన్న సిరికల్చర్ స్థలాన్ని, దానికి ఎదురుగా ఉన్న స్థలాన్ని మంగళవారం కలెక్టర్ షన్మోహన్ పరిశీలించారు. ఎంకపురం చెరువు సమీపంలోని హంద్రీనీవా కాలువను, పక్కనే ఉన్న చెరువునూ చూశారు. సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో సభ కోసం ఈ స్థలాలను పరిశీలించినట్లు సమాచారం. సీఎం పర్యటన ఈనెల 16లేదా 25వ తేదిపైన ఉంటుందని అధికార పార్టీ నాయకులు తెలిపారు. కలెక్టర్ పర్యటన ఫొటోలు తీసేందుకు విలేకరులు ప్రయత్నించగా.. వద్దని కలెక్టర్ నిరాకరించారు. ఎమ్మెల్సీ భరత్, తహసీల్దారు మురళీకృష్ణ, అధికారులు, వైసీపీ నేతలు, ఇతర ప్రజా ప్రతినిధులు కలెక్టరుతో పాటు ఉన్నారు. కాగా, ఈ నెల 5వ తేది సీఎం జగన్ రామకుప్పం పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే.

కర్ణాటక మద్యంతోపాటు బైకు పట్టివేత

బాలుడితో పాటు మరొకరి అరెస్టు

పలమనేరు, ఫిబ్రవరి 13: పలమనేరు రఘువీరారెడ్డి కాలనీలో విక్రయాలకోసం కర్ణాటక మద్యం మోటరుసైకిల్ పై తీసుకొచ్చిన సుందరేష్‌ను, మరో బాలుడిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. వీరి నుంచి మోటరుసైకిల్‌ను, రూ.50వేల విలువ చేసే 576 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్పీ



నగరి, ఫిబ్రవరి 13: నగరి మండలం.. తమిళనాడు సరిహద్దున ఉన్న చెక్‌పోస్టును మంగళవారం ఎస్పీ జాషువా తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టులను తనిఖీ చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా కొత్తగా వచ్చిన ఎస్పీ జాషువా తడుకుపేట వద్ద గల ఈ చెక్‌పోస్టును తనిఖీ చేసి.. సిబ్బందికి సూచనలిచ్చారు. సీఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటికి రికార్డుస్థాయి ఆదాయం



దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 : శ్రీకాళహస్తీశ్వరాలయానికి రికార్డు స్థాయి ఆదాయం లభించింది. ఆలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో జరిగిన లెక్కింపులో 1,85,80,188 రూపాయలు హుండీ ద్వారా వచ్చింది. బంగారం 118 గ్రాములు, వెండి 572.350 కేజీలు రాగా వివిధ దేశాలకు చెందిన 153 నోట్లు లభించాయి. 34 రోజుల తర్వాత జరిగిన లెక్కింపులో వచ్చిన ఈ ఆదాయం సరికొత్త రికార్డుగా అధికారులు ప్రకటించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.48 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం భారీగా లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. రూ.5.48 కోట్లు లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 69,314 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,165 మంది తలనీలాలు సమర్పించారు.

పద్మావతి వర్సిటీ వీసీ నేపాల్‌కు పయనం



ప్రొఫెసర్ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 : పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి నేపాల్‌కు పయనమయ్యారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ ఖాట్మండ్‌లో నిర్వహించనున్న ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఆమె పాల్గొంటారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు, బోధన, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, విదేశీ విద్యార్థులు పద్మావతి వర్సిటీలో చదువుకోవడానికి అవకాశాలు కల్పించడం కోసం ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్టు చెప్పారు. తిరుపతి నుంచి మంగళవారం ఆమె పయనమయ్యారు.

రెండో రోజూ వైభవంగా..!

పేటమిట్టలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న గల్లా కుటుంబీకులు

పూతలపట్టు, ఫిబ్రవరి 13: పూతలపట్టు మండలం పేటమిట్టలో రెండో రోజైన మంగళవారం కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు వేద స్వస్తి గోపూజ, యంత్రార్చన, ప్రధానకుంభ వాహనాలు, గణపతి అష్ట ద్రవ్య హవనం, ప్రతిష్ఠించబోయే సమస్త దేవతల విగ్రహాలకు పంచగవ్యం, క్షీరం, నదీసదా సముద్ర జలాలతో గల్లా జయదేవ్, గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి చేతుల మీదుగా పూజాభిషేకాలు జరిగాయి. సాయంత్రం మూషిక వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, గంట, రథం, శిలా గజాలకు దాతలచే పూజలు నిర్వహించారు. 5 గంటల నుంచి యాగశాల మండపం అర్చకులు వివిధ దేవతలకు హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. అమరరాజా విద్యాసంస్థల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, సర్పంచి గల్లా రాధాకృష్ణ, ట్రస్టు సెక్రటరీ గల్లా రాజశేఖర్, ట్రెజరర్ గల్లా రామానాయుడు, సభ్యులు భానుమూర్తి నాయుడు, గల్లా సంపత్ నాయుడు, గల్లా దామోదర ప్రసాద్, బాబ్జీ, చౌదరి, ట్రస్టు సభ్యులు, పేటమిట్ట పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారులూ.. ఇదేమి తీరు!

ఆర్టీసీ బస్టాండులో ఆసరా కార్యక్రమం - ముందురోజే ఏర్పాట్లతో రోడ్డుపైనే ఆగిన బస్సులు

పలమనేరులో ప్రయాణికులకు అగచాట్లు





ఆర్టీసీ బస్టాండులో మంగళవారం మధ్యాహ్నం నుంచే షామియానా వేస్తున్న కూలీలు - జాతీయరహదారిపై నిలిచిన బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

పలమనేరు, ఫిబ్రవరి 13: ఆర్టీసీ బస్టాండులో 'ఆసరా' సభ పెట్టాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆదేశించారు. అధికారులు పాటించారు. బుధవారం నాటి సభకు.. మంగళవారం మధ్యాహ్నం నుంచే ఏర్పాట్లు చేపట్టారు. వీరి నిర్వాకంతో పలమనేరులోని బస్టాండుకు బస్సులు రాక.. ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. ఆసరా పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు విడతల వారీగా చెక్కులు పంపిణీ చేస్తుంటారు. ఎన్నికల వేళ అధికార పార్టీ మరింత ప్రచారం కోసం ఈ చెక్కుల పంపిణీకి ప్రభుత్వ ఖర్చుతో సభను ఏర్పాటు చేస్తోంది. పలమనేరు మున్సిపాలిటీలోని 785 సంఘాలకు ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా బుధవారం చెక్కుల పంపిణీకి కార్యక్రమాన్ని రూపొందించారు. పట్టణంలో పలు కల్యాణ మండపాలు, ఆటస్థలాలున్నా.. దీనికి వేదికగా పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండును ఎంచుకున్నారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే బస్టాండులో అధికారులు షామియానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆర్టీసీ బస్టాండుకు రావాల్సిన బస్సులను జాతీయ రహదారిపైనే నిలిపి వేశారు. వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సులకోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులను ఎక్కేందుకు.. దిగిన వారూ.. జాతీయ రహదారి దాటాల్సి రావడంతో ఇబ్బంది పడ్డారు.

దుకాణదారుల ఆవేదన

ఇక, ఆర్టీసీ బస్టాండులోని దుకాణదారులూ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా బస్టాండులో అత్యధిక అద్దెలు చెల్లిస్తూ గదులు, ఖాళీస్థలాలు తీసుకొని చిరువ్యాపారాలు చేసుకొంటున్నారు. సగటున వీరు ప్రతిరోజు రూ.500నుంచి రూ.700 వరకు అద్దె చెల్లిస్తుంటారు. రెండురోజుల పాటు వ్యాపారాలు చేసుకునే వీల్లేకుండా.. బస్సులు బస్టాండులోకిరాకుండా చేయడంతో అద్దె చెల్లింపులకు ఇబ్బంది పడాల్సి వస్తోందని అంటున్నారు. అధికార పార్టీ నాయకుల మన్నన కోసం అధికారులు చూపే ఈ అత్యుత్సాహం ప్రయాణికులు, చిరువ్యాపారులకు ఇబ్బందిగా మారింది.

వీడని ఏనుగులు





విరిచేసిన అరటి పంట - ఏనుగులు ధ్వంసం చేసిన చెరకు క్రషర్

సదుం, ఫిబ్రవరి 13: సదుం మండలం అటవీ శివారు ప్రాంతాల్లో తరచూ ఏనుగుల గుంపు తిరుగుతున్నాయి. పంట పొలాలను ధ్వంసం చేస్తుండడంతో రైతుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. జోగివారిపల్లె పంచాయతీ మార్తువారిపల్లె సమీపంలో సోమవారం రాత్రి రైతు లోకనాథంకు చెందిన చెరకు, బెల్లం గానుగ సామగ్రి, క్రషర్, పక్కనే ఉన్న అరటి తోటను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ ఏనుగుల సంచారం, పంట పొలాల ధ్వంసంతోపాటు ఇటీవల ఏనుగుల దాడిలో ఒకరిద్దరు గాయపడి, మృతి చెందడం స్థానికులను కలవరపాటుకు గురిచేస్తోంది.



ఏనుగుల దాడిలో మామిడి చెట్లు ధ్వంసం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 13: బంగారుపాళ్యం మండలం కొదలమడుగు అటవీసమీపంలోని ఏనుగుల గుంపు సోమవారం రాత్రి మామిడి తోటలపై దాడిచేసి, పూతకు వచ్చిన కొమ్మలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన మాసలామణికి చెందిన సుమారు 30 మామిడిచెట్లను, పూతకొచ్చిన మామిడికొమ్మలను ధ్వంసంచేశాయి.

రథసప్తమికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

నూతన ఎస్పీ మలికా గర్గ్



రథసప్తమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యజయంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీన తిరుమలలో రథసప్తమికి కట్టుదిట్టమైన భద్ర ఏర్పాట్లు చేస్తామని నూతన ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆమె మంగళవారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్, స్థానిక పోలీసు అధికారులతో కలిసి మాడవీధులు, గ్యాలరీలు, భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను పరిశీలించారు. అవుటర్ రింగ్ రోడ్డు, కమాండ్ కంట్రోల్ రూంను చూశారు. రథసప్తమికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్య, వాహన సేవల నిర్వహణ, ఏటా ఎదురయ్యే సమస్యల గురించి సీవీఎస్వో ఎస్పీకి వివరించారు. మలికా గర్గ్ మీడియాతో మాట్లాడుతూ రథసప్తమి రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం టీటీడీ ఈవో ధర్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

దొంగ ఓట్ల నుంచి తిరుపతిని కాపాడు తల్లీ!

- గంగమ్మ గుడిలో టీడీపీ నాయకుల వేడుకోలు



తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి మాయనిమచ్చగా నిలిచిన దొంగ ఓట్లు నుంచి కాపాడాలని టీడీపీ నేతలు కోరారు. జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తిరుపతిలో దొంగ ఓట్లపై నిరసనగా మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో టీడీపీ శ్రేణులు వేయికళ్ల దుత్తలతో వేడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికలు మొదలుకుని లోక్‌సభ ఉప ఎన్నికలు, టౌన్ బ్యాంకు ఎన్నికల వరకు దొంగ ఓట్లుపైనే గెలిచారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లుతో గెలవాలని చూశారని, విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు స్వస్తి పలికేలా గంగమ్మ తల్లి కాపుకాయాలని కోరారు. సూత్రధారులను పోటీకి అనర్హులుగా ప్రకటించాలని డిమాండు చేశారు. అదేవిధంగా తిరుపతి గంగ జాతరను రాజకీయం చేశారని, కానుకలను ఖాళీ చేసి ఆలయాన్ని అప్రతిష్టపాలు చేశారని విమర్శించారు. రాబోయే జాతరకు కూడా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయలేరని, భక్తులకు ఇబ్బందులు తప్పవని అన్నారు.

గంగను వదిలి పంటలను కాపాడండి



తెలుగుగంగ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 13: తెలుగుగంగ నీరందించి ఎండుతున్న పంటలను కాపాడాలని సంబంధిత అధికారులకు మంగళవారం రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో చెరువులోని నీరు చివరి తడికమాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయని నీరు ఇవ్వకపోతే 1000 ఎకరాల్లో వేసిన వరి పంటలు ఎండిపోతాయని తెలిపారు. దీనిపై అధికారులు స్పందిస్తూ నీటి విషయంపై ఉన్నతధికారుల దృష్టికి తీసుకుపోతామని చెప్పారు.

నిరుద్యోగులపైనా బాదుడే

టెట్ రుసుం రూ.250 పెంపు

ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపు లేదు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ పోటీపరీక్షలకు దరఖాస్తు అంటేనే నిరుద్యోగులు భయపడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 336 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. వీటికి వేలాది మంది పోటీపడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ డీఎస్సీ రాసేందుకు అభ్యర్థులు టెట్‌లో అర్హత సాధించాలి. 2022లో వైసీపీ ప్రభుత్వం టెట్ నిర్వహించింది. అప్పట్లో పేపర్‌కు రూ.500 చొప్పున రుసుము వసూలు చేశారు. తాజాగా దీనిని రూ.250 పెంచి రూ.750గా ఖరారుచేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులకు ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. జనవరిలో కేంద్ర ప్రభుత్వం సీ-టెట్ నిర్వహించింది. ఒక్కో పేపర్‌కు రూ.500 రుసుం నిర్ణయించింది. రెండు పేపర్లు రాస్తే రూ.600 మాత్రమే వసూలు చేసింది. అదే మన రాష్ట్రంలో పేపరుకు రూ.750 చొప్పున ఎన్ని పేపర్లు రాయాలంటే అన్నిటికీ వేరువేరుగా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. డీఎడ్, బీఈడీ, ఎంఈడీ విద్యార్హత ఉన్నవారు టెట్ మూడు పేపర్లు రాస్తారు. అదే డీఎడ్, బీఈడీ అర్హతలు ఉంటే తప్పనిసరిగా రెండు పేపర్లు రాయాలి. 2018 తర్వాత డీఎస్సీ లేకపోవడంతో మూడు ఉపాధ్యాయ విద్యార్హతలు ఎక్కువ మందికి ఉన్నాయి. ఒక్క పేపరుకు రూ.750 చొప్పున మూడు పేపర్లకు రూ.2250, రెండు పేపర్లకు రూ.1500 చెల్లించాల్సివుంది. ఇక పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సుమారు రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు పుస్తకాల కొనుగోళ్లకే ఖర్చు చేయాలి. టీడీపీ హయాంలో శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సర్కిల్స్ ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక స్టడీ సర్కిల్స్ మాయమయ్యాయి. దాంతో అభ్యర్థులు సొంతంగా పరీక్షలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు అందివ్వండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13: చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, ఇతర పెన్షనర్లు 2023-24 సంవత్సరానికి సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెలాఖరులోగా అందజేయాలని చిత్తూరు సబ్‌ట్రెజరీ ఆఫీసర్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా సమీప ఉపఖజానా కార్యాలయాలకు నేరుగా వచ్చి వీటిని అందించాలన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఇబ్బందులు ఉంటే 9951602382కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చని సూచించారు. ఇప్పటికే సుమారు 70శాతం మంది పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వని వారికి మార్చి ఒకటి నుంచి పెన్షన్ ఆగే పరిస్థితి ఉందన్నారు.

వైసీపీ ర్యాలీలో ఉపాధి ఉద్యోగి చిందులు



వైసీపీ ర్యాలీలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మదివానందం (చారల చొక్కా వ్యక్తి)

చిత్తూరు, ఫిబ్రవరి 13: అతడు పని చేసేది పెనుమూరు మండలంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా. సొంతూరేమో పాలసముద్రం మండలంలోని ఆముదాల పంచాయతీ. ఇక్కడ ఈయన భార్య అనురేఖ అధికారపార్టీకి చెందిన సర్పంచి. ఈ క్రమంలో పక్క మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసే మదివానందం.. సొంత పంచాయతీలో వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మంగళవారం వైసీపీ నాయకులు 'సిద్ధం' పేరుతో బలిజకండ్రిగ నుంచి రంగాపురం మీదుగా నరసింహాపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు ఉత్సాహంతో చిందులు వేశారు. ఈ చిందుల్లో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ మదివానందం చిందులేయడం విమర్శలకు తావిచ్చింది. టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉంటూ విధులకు హాజరుకాకపోయినా పెనుమూరు మండల అధికారులు ఎలా ఉపేక్షిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇతడు చిందులేసిన వీడియో సోషల్ మీడియాలో మంగళవారం హల్‌చల్ చేసింది.

బావిలో పడి మూగబాలుడి మృతి


మృతిచెందిన రుషికేశవనాయుడు

సోమల, ఫిబ్రవరి 13: సోమల మండలం అన్నెమ్మ గారిపల్లె పంచాయతీ ఎర్రగుంతలపల్లెకు చెందిన మూగ బాలుడు ప్రమాద వశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకట నరసింహులు కథనం మేరకు.. శ్రీదేవి కుమారుడు రుషికేశవనాయుడు (15) పుట్టకతో మూగవాడు. రెండు రోజులుగా అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించారు. సోమవారం సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం గ్రామ సమీపం లోని బావిలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. బావిలో ప్రమాదవశాత్తూ పడి మునిగిపోయి ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



చికిత్స పొందుతున్న రోగులు

శాంతిపురం, ఫిబ్రవరి 13 : శాంతిపురంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరోగ్యరథం ద్వారా ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంపీపీ ఉదయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఆరోగ్య మొబైల్ బస్సు ఏర్పాటు చేసి ప్రజలకు ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్న ఘనత నారా భువనేశ్వరికే దక్కిందన్నారు. రోజుకు వందలాది మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం చాలా సంతోషకరమన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో సుమారు 340 మంది రోగులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మధుసుదన్‌రావు, నాయకులు ఏఎంసీ నాగరాజు ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో మరింత నాణ్యమైన చదువు


మాట్లాడుతున్న పలమనేరు ఎంఈఓ లీలారాణి

పలమనేరు, ఫిబ్రవరి13: శిక్షణతో మరింత నాణ్యమైన చదువు అందించవచ్చని ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తెలియజేశారు. మంగళవారం పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట, బంగారుపాళ్యం మండల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ప్రసంగించారు. పాఠశాలల భవనాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, మానిటరింగ్‌కు సంబంధించి టీచ్ టూల్ అబ్జర్వేషన్, టీచర్ ప్రొఫెషనల్ డెవలప్ మెంట్, టీచ్ అట్ రైట్ లెవెల్, పాల్‌ల్యాబ్స్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ టీచర్స్, స్టూడెంట్స్ వినియోగం, బైజూస్ వినియోగంపై విపులంగా వివరించారు.

గ్రామీణ సమ్మెను జయప్రదం చేద్దాం


మాట్లాడుతున్న రామిశెట్టి వెంకయ్య

గంగవరం, ఫిబ్రవరి 13: ఈ నెల 16న జరగబోయే దేశవ్యాప్త గ్రామీణ సమ్మెను కార్మిక, కర్షకులందరూ జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య పిలుపునిచ్చారు. మంగళవారం గంగవరం వినాయకనగర్‌లో రైతుకూలీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర , రాష్ట్ర ప్రభు త్వాలు కార్మిక, కర్షకుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికుల హక్కులను కాలరాయ డానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ ప్రయత్నాన్ని తిప్పికొట్టడానికి కలసికట్టుగా ముందుకు రావాలన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు వారికి అప్పగించడానికి కుట్రలు పన్నుతోందన్నారు. ఈ కార్య క్రమంలో సంఘ నేతలు కె.సుబ్రమణ్యం, వీఆర్ జ్యోతి, సురేంద్రనాథ్, వెంకటరమణ, ఉమాపతి, లక్ష్మీ, శకుంతల, సరోజ పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ


ఆసరా చెక్కులను అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

గంగవరం, ఫిబ్రవరి 13: గంగవరం మండలంలో అర్హులైన మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.10 కోట్ల 35 లక్షల చెక్కులను ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ పంపిణీ చేశారు. మంగళవారం గంగవరం గ్రామ పమీపంలోని మైదానంలో వైఎస్సార్ ఆసరా ద్వారా చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గంగవరం మండలంలోని 1065 సంఘాలలోని 10,650 మంది సభ్యులకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.10 కోట్ల 35 లక్షలు మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ బజార్ అధ్యక్షులు సుభాష్‌చంద్రబోస్, ఎంపీపీ వెంకటరమణ, జడ్పీటీసీ పార్వతీచంద్రప్ప, మోహన్‌రెడ్డి, చలపతిరెడ్డి, గిరిరాజారెడ్డి, ప్రహ్లాద, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ

సోమల, ఫిబ్రవరి 13: సోమల పంచాయతీ మునిరెడ్డిగారిపల్లెలో మంగళవారం నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గణపతిపూజ, గంగపూజ, అంకురార్పణ, రక్షాబంధన, వాస్తు హోమం తదితర కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. 14వ తేదీన కలశార్చన, ధాన్యాదివాసం, విగ్రహ ప్రతిష్ఠాపణ, గోపుర కలశ స్థాపన, ధ్వజారోహణం, 15న కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు నల్ల బ్యాడ్జీలతో విధులకు

పలమనేరు, ఫిబ్రవరి13 : రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వ సాచివేత ధోరణికి నిరసనగా ఉద్యమ కార్యాచరణలో భాగంలో ఈనెల 14 వతేదీ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని పలమనేరు తాలూకా ఎన్జీఓ జేఏసీ చైర్మన్ ఆనందబాబు పిలుపునిచ్చారు. మంగళవారం పలమనేరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14వ తేదీ బుధవారం అందరు ఉద్యోగులు, ఉపాధ్యా యులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సిగ్ ఉద్యోగులు, నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. ఈ సమా వేశంలో జిల్లా ఏపీఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు లక్ష్మీపతియాదవ్, పలమనేరు కార్యదర్శి జయమ్మ, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల నాయకులు హరి, రమణ పాల్గొన్నారు.

నేడు సైన్స్‌కళాయాత్ర

పలమనేరు, ఫిబ్రవరి13 : పలమనేరులో ఈ నెల 14వ తేదీ జన విజ్ఞాన సమితి సైన్స్ కళాయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రజలలో శాస్త్ర విజ్ఞానం, సైన్సుపట్ల అభిరుచిని పెంచడానికి, మూఢ నమ్మకాలు, అపోహలను దూరం చేయడానికి జేవీవీ ఈ కళాయాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా పలమనేరు గంగమ్మ గుడి ఆవరణలో ఉన్న ఆడిటోరియంలో గీతాలాపన, నాటిక, నృత్యరూపకం, మ్యాజిక్ షో, ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సైన్సు అభిలాషులు పాల్గొనాలని కోరారు.

ఈఈఎంపీ పరీక్షలో పులిచెర్ల విద్యార్థికి 3వ ర్యాంకు


చరణ్

కల్లూరు, ఫిబ్రవరి 13: పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పి. చరణ్ ఈఈఎంపీ (ఎడ్యుకేషనల్ ఎఫిషనీ మెరిట్ టెస్ట్) పరీక్షలో జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించినట్లు ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సయ్యద్ సాహేబ్‌వల్లి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన ఈఈఎంపీ ఆన్‌లైన్ పరీక్షలో చరణ్ తన ప్రతిభ కనబరిచాడన్నారు. ప్రశంసా పత్రంతో బాటూ ఉపకారవేతనం పొందేందుకు అర్హత సాధించాడన్నారు.

గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలం పరిశీలన



కుప్పం, ఫిబ్రవరి 13: కుప్పం నియోకవర్గంలోని గాండ్ల కులస్థుల కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని మంగళవారం రెస్కో ఛైర్మన్ జీఎస్.సెంథిల్‌కుమార్ పరిశీలించారు. గుడుపల్లె మండల పరిధిలోని గుండ్ల సాగరం గ్రామ సమీపంలో రెండెకరాల స్థలాన్ని కేటాయిం చినట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. గాండ్ల కుల స్తులతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామని తెలిపారు.

వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా భాస్కర్‌నాయక్



రామకుప్పం, ఫిబ్రవరి 13 : కుప్పం నియోజకవర్గ వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రామకుప్పం మండలం పీఎంకే తాండ పంచాయతీకి చెందిన ఎంఎస్ భాస్కర్ నాయక్ నియమి తులయ్యారు. ఈ మేరకు జిల్లా వైసీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ భరత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

షాదీ మహల్ కమిటీ నియామకం


నియమాక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం, ఫిబ్రవరి 13 : రామకుప్పం మండల షాదీ మహల్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. షాదీ మహల్ కమిటీ సభ్యులుగా నాసీర్ బాషా, నిజాం, నూర్ అహ్మద్, ఇలియాజ్, హసీనా లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్ కమిటీ సభ్యులకు మంగళవారం నియామక పత్రాలను అందించారు.

భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలి


అనెకరలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఫిబ్రవరి 13 : బిడ్డల భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు నందిగం ఉదయకుమార్, టీడీపీ మాజీ మండల అధ్యక్షులు విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు ఇ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చెంగుబల్ల, 121 పెద్దూరు, అనెకర, రేగడదిన్నేపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామాల్లో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమాలు, కక్షసాధింపు చర్యలు గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రం అప్పుల బారిన పడి అధోగతి అయిందన్నారు. మళ్లీ వైసీపీకి అవకాశం ఇస్తే రాష్ట్రం మరో ఆఫ్ఘనిస్తాన్ కావడం కాయమన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సంపద సృష్టించ డంతోపాటు ప్రజలకు సంపూర్ణంగా సంక్షేమ పథకాలు అందిస్తా రన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవ కాశాలు రావాలంటే యువత టీడీపీని బలపర చాలన్నారు. అలా జరగాలంట గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు సమన్వ యంతో పని చేసి చంద్రబాబుకు లక్ష ఓట్లు మెజారిటీ తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జిలు రమేష్‌రెడ్డి, గోపాల్, లోకేష్, సుధాకర్, మునిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, నారాయణరెడ్డి, ఏఎంసి నాగరాజు, ఉయ్యాల జయరామిరెడ్డి, మురళి, బీరప్ప, ఆర్ఎస్ మణి, మంజునాథ్, చంద్రశేఖర్, జనసేన నాయకులు కిషోర్‌కుమార్, వేణు, ధనుష్, పాల్గొన్నారు.

అనాథ పిల్లలను 'మిషన్ వాత్సల్య'కు ఎంపిక చేయండి

- కలెక్టర్ షన్మోహన్ ఆదేశం
- వివరాలు సేకరించిన ఐసీడీఎస్ పీడీ



అనాథలైన పిల్లలతో హరి, సుమలత దంపతులు

కల్లూరు, ఫిబ్రవరి 13: పులిచెర్ల మండలం మంగళంపేట ఎస్టీ కాలనీకి చెందిన వంశీ, లక్ష్మీదేవి దంపతులు ఆరునెలల వ్యవధిలో ఒకరి తర్వాత ఒకరు మృతి చెందడంతో ఎనిమిదేళ్లలోపు ఉన్న వీరి ముగ్గురు పిల్లలు సౌమ్య, హేమలత, వివేక్ అనాథలయ్యారు. వీరి భవిష్యత్తు ప్రశ్నార్థకరంగా మారింది. దీనిపై 'ఎంత కష్టమొచ్చింది' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ షన్మోహన్ స్పందించి అనాథ పిల్లల వివరాలు సేకరించాలని, మిషన్ వాత్సల్య పథకానికి ఎంపిక చేయాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. దీంతో ఐసీడీఎస్ పీడీ నాగశైలజ మంగళంపేట ఎస్టీ కాలనీకి చేరుకొని అనాథపిల్లల పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పీడీ నాగశైలజ మాట్లాడుతూ మృతిచెందిన పిల్లల తండ్రి వంశీ మేనమామ హరి, సుమతల దంపతుల ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు వాళ్ల అమ్మమ్మ సంరక్షణలో రైల్వే కోడూరులోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఇద్దరూ 1వ తరగతి చదువుతున్నారన్నారు. వివేక్‌ను స్వగ్రామంలోనే తండ్రి మేనమామ హరి సంరక్షణలో ఉన్నాడన్నారు. తమకు ఇప్పటివరకు పిల్లలు లేరని, ఇకపై పిల్లలు పుట్టే అవకాశం లేదని, ముగ్గురు బిడ్డలను చూసుకుంటానని హరి, సుమలత దంపతులు తెలిపారన్నారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒక బిడ్డకు నెలకు రూ: 4000 అందిస్తామన్నారు. మిషన్ వాత్సల్య పథకానికి ఒక కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులన్నారు. అయితే ముగ్గురికీ లబ్ధి చేకూరేలా కృషిచేస్తామని పీడీ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేసే పార్టీని గెలిపించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

పుంగనూరు, ఫిబ్రవరి13: రానున్న ఎన్నికల్లో యువత రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేసే పార్టీని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. యువత ఓటు హక్కును సక్రమంగా వినియోగించు కోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరును పరిశీలించు కోవల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే నాయకులకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టే రాజకీయ పార్టీలకు తగిన బుద్ధిచెప్పడానికి యువత పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కాలవగడ్డ మునీంద్ర, మీడియా కో-ఆర్డినేటర్ గుణిగింటి దేవేంద్ర, పాలడుగు రెడ్డెప్పనాయుడు, షాబానా, మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, ఆసూరి బాలాజీ, పోలీస్ గిరి, దేశాధి ప్రకాశ్, సోమల సద్దాం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సవితా సమాజం ఉపాధ్యక్షుడిగా పద్మనాభం



రామకుప్పం, ఫిబ్రవరి 13 : రామకుప్పం మండలం బందార్లపల్లె గ్రామానికి చెందిన పద్మనాభం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సవితా సమాజం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటుపల్లె నాగేశ్వరావు మంగళవారం నియామక ఉత్తర్వులు పంపారు. ఈ సందర్భంగా పద్మనాభం మాట్లాడుతూ తాను టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డోలు కళాకారుడిగా సేవలు అందించానని తెలియజేశారు. తన సేవలను గుర్తించిన నాగేశ్వ రావుకు ధన్యవాదాలు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సవితా సమాజం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. పద్మనాభాన్ని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు అభినందించారు.

టీడీపీలో చేరిన పెద్దగొట్టిగల్లు వైసీపీ నాయకులు



రొంపిచెర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని పెద్దగొటి ్టగల్లు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయ కులు మంగళవారం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థంపుచుకున్నారు. వైసీపీ నాయకులు గోపీనాథరెడ్డి, సహదేవ, సుధాకర్, రమణలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, మాజీ మండల కన్వీనర్ చింతపర్తి ఓబులేశ్వరరెడ్డి, వెంకట్రమణారెడ్డి, హరిబాబు, నరేన్, మురళీనాయుడు, రవికుమార్‌నాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


నెల్లిమందలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

సోమల, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, తహసీల్దార్ నాగరాజతో కలసి పరిశీలించారు. మంగళవారం కందూరు, నెల్లి మంద, కామిరెడ్డి వారిపల్లె, వల్లిగట్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వసతులపై స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, కార్యదర్శులతో సమీక్షించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతపై వివరాలు నమోదు చేసుకున్నారు. వారివెంట ఎస్‌ఐ వెంకట నరసింహులు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో పేదల బతుకు బంగారం


సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఫిబ్రవరి 13: చంద్రబాబు విడుదల చేసిన మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతో పేదల బతుకు బంగారమవుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని తంబిగానిపల్లెలో మంగళవారం ఆయన 'గతం గుర్తు చేసుకుందాం.. బాబు రుణం తీర్చుకుందాం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ పథకాలు అమలు పేదలను సంపన్నులు చేయడానికే ఉద్దేశించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళకూ నెలకు రూ.15 వేలు, తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తారని చెప్పారు. దీపం పథకం కింద ఏడాదికి ప్రతి కుటుంబానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారని వివరించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తారని, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తారని, యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి అందిస్తారని పేర్కొన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చి అన్నివిధాలా వారికి అండగా నిలుస్తామన్నారు. కుప్పంలో చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలతో ముద్రించిన క్యాలెండర్, కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడింపల్లె వద్ద పశుగ్రాసం దగ్ధం



సోమల, ఫిబ్రవరి 13: సోమల మండలం నడింపల్లెకు చెందిన దొంగరి శివయ్య వ్యవసాయ పొలం వద్ద నిల్వ చేసిన రూ.50వేలు విలువ చేసే వరి గడ్డి ప్రమాదవశాత్తూ కాలిపోయింది. గడ్డి వద్దనున్న 2 బస్తాల యూరియా, 10పీవీసీ పైపులు కాలిపోయాయి. సమీపరైతులు, గ్రామస్తులు మంటలు ఆర్పారు.

మావురాల ఎల్లమ్మకు ప్రత్యేకపూజలు



రొంపిచెర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని పెద్దగొట్టిగల్లు సమీపం లోని మావు రాల ఎల్లమ్మకు గ్రామస్తులు మంగళ వారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలు, చీర సారెలతో పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పెద్దలు సుబ్రమణ్యం, రామక్రిష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అబ్దుల్‌కలామ్ విగ్రహ ప్రతిష్ఠకు విరాళం



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి13: పట్టణంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ విగ్రహ ప్రతిష్ఠకు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు విరాళం అందజేశారు. మంగళవారం అబ్దుల్‌కలామ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అయూబ్‌ఖాన్, నాగరాజులకు రూ.10వేలు అందజేశారు.

ఓటర్లను తొలగించడం ఆపాలి



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి13: పట్టణ, మండల పరిధిలో ఫారం-7 ద్వారా ఓటర్లను ఎక్కువశాతం తొలగిస్తున్నారని, వెంటనే నిలుపుదల చేయాలని కాంగ్రెస్ నాయకుడు సజ్జాద్, ఐటీడీపీ నాయకుడు కుమార్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడిని కలిసిన పుంగనూరు నేతలు


జగన్మోహన్‌రాజును కలిసిన చల్లా రామచంద్రారెడ్డి, ఇతర నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి13: టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు జగన్మోహన్‌రాజును పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు యువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు టీడీపీ నాయకులు వరదరాజు, నూరుల్లా, షామీర్, నౌషాద్, నాగరాజ, నిర్మల్‌నాయక్, ఫయాజ్, చంద్రన్న, సుహేల్ తదితరులు పాల్గొన్నారు.

పగలు సెగ... రాత్రి చలి



ఉదయం 8 గంటలకు కూడా మంచు తెరలు

పెనుమూరు, ఫిబ్రవరి 13: ఫిబ్రవరి నెలలోనే వేసవి మొదలైనట్లు కనిపిస్తుంది. పగటివేళ విపరీతమైన ఎండలే ఇందుకు నిదర్శనం. మధ్యాహ్నం 12 గంటలైతే బయట తిరగాలంటే ప్రజలు భయపడుతున్నారు. అయితే సాయంత్రానికి మాత్రం చలి వేస్తోంది. మంగళవారం ఉదయం 8 గంటలకు కూడా పెనుమూరులో మంచు విపరీతంగా కురుస్తుండటంతో వాహనదారులు రోడ్లపై వాహనాలు నడిపేందుకు ఇబ్బందులకు గురయ్యారు.

డాక్టర్ థామస్‌కు చంద్రబాబు అభినందనలు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న డాక్టర్ థామస్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 13: గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్‌ను ఆ పార్టీ అధినేత చంద్రబాబు మంగళవారం అభినందించారు. గంగాధరనెల్లూరు సమీపంలోని రామానాయుడుపల్లె బస్టాప్ వద్ద ఈ నెల 6వ తేదీన జరిగిన 'రా... కదిలిరా' కార్యక్రమం విజయవంత మైనందుకు ప్రత్యేకంగా థామస్‌ను పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించుకుని చంద్రబాబు అభినందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కడపకు చెందిన రామసుబ్బారెడ్డి మంగళవారం రూ.2,00,000 విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన జ్ఞానేంద్రరెడ్డి వర్గం



పెనుమూరు, ఫిబ్రవరి 13: ముఖ్యమంత్రి జగన్‌ను ఎన్‌ఆర్‌ఐ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, జీడీనెల్లూరు నియోజకవర్గంలోని మరికొందరు వైసీపీ నాయకులు మంగళవారం కలిశారు. నియోజవర్గంలోని వైసీపీ శ్రేణులు మాత్రం ఈ విషయంపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు. నారాయణ స్వామి టికెట్ విషయంలో మరోసారి ప్రజాభిప్రాయం తీసుకోవాలని జగన్‌ను అడిగినట్లు ఒక వర్గం చెబుతున్నారు. మరో వర్గం అందరూ కలిసి పార్టీకి పని చేయండి.. నేను చూసుకుంటాను అని జగన్ చెప్పారని అంటున్నారు. జగన్‌ని కలిసినవారిలో వైసీపీ జిల్లా ప్రధానకార్యదర్శి దయాసాగర్‌రెడ్డి, జీడీనెల్లూరు మండలం వేల్కూరు బాబురెడ్డి, పాలసముద్రం ఎంపీపీ భర్త శివప్రకాష్‌రాజు, కార్వేటినగరం మండలానికి చెందిన ధనంజయరెడ్డి, బండి జగదీశ్‌రెడ్డిలు తదితరులు ఉన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన వైసీపీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో నారాయణస్వామి పేరు ఉండటంతో 5వతేదీన జీడీనెల్లూరులో స్వామికి టికెట్ కేటాయిస్తే పనిచేయము అని ఆయన వ్యతిరేకవర్గం ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందే. ర్యాలీలో పాల్గొన్న నేతలంతా మంగళవారం జగన్‌ను కలిసి సుమారు 50 నిమిషాల పాటు మాట్లాడారని పెద్ద చర్చే జరుగుతుంది.

నేటి నుంచి పీఈఎస్‌లో ఇన్‌స్పైర్ కార్యక్రమం

యాదమరి, ఫిబ్రవరి 13: జిల్లా విద్యాశాఖ, ఎస్‌ఎస్‌ఏల ఆధ్వర్యంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు పీఈఎస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బాల శాస్త్రజ్ఞుల కార్యక్రమాల ప్రదర్శన (ఇన్‌స్పైర్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉప విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ షన్మోహన్ ప్రారంభిస్తారని, డీఈవో దేవరాజు, ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వెంకటరమణారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి రమణ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ప్రదర్శలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని అన్నారు. ఈ ప్రదర్శనను నగరంతో పాటు చుట్టుపక్కల మండలాల విద్యార్థులు తిలకించాలని ఆయన కోరారు.

జేఈఈ ఫలితాల్లో

పీఎస్‌ఎన్ శ్రీవివేకానంద విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చిత్తూరు, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ ప్రకటించిన సెషన్ వన్ ఫలితాల్లో స్థానిక పీఎస్‌ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి చిత్తూరులోనే టాపర్లుగా నిలిచినట్లు కరస్పాండెంట్ పి. సత్యనారాయణ తెలిపారు. కళాశాలకు చెందిన పి. చరిత్ చౌదరి 99.17 శాతం సాధించగా, ఎ. రిత్విక్‌రాజు 97.32, ఎల్. నెహిత 96.59, వి. ప్రీతి 96.12, ఎం.బి. చందన 95.01, వీజే మహమ్మద్ 94.58, ఏసీ పవన్ 94.24, ఎల్. తేజ సాయి 94.09, సి. సింధు 93.44, ఎ. రిషికేష్‌రామ్ 92.21, కె. తారాచంద్ 91.79, జె. దుర్గాప్రసన్న 91.05, కె. చాందిని 90.77 శాతం సాధించినట్లు తెలిపారు. 47 మంది విద్యార్థులు 80శాతానికి పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన అధ్యాపకులను, విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి తదితరులు అభినందించారు.

రైతులకు అవగాహన సదస్సు

నగరి, ఫిబ్రవరి 13: నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో కెనడాకు చెందిన షైగ్రో అభ్యాసనా కేంద్రం నిర్వాహకులతో మంగళవారం రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. టీమ్ లీడర్ తమజోలి, ఆప్కాబ్ షైగ్రో అభ్యాసనా కేంద్రం టీమ్ లీడర్ మస్తాన్‌లు మాట్లాడుతూ సజ్జ, చెరకు, వేరుశనగ, వరి పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు ఏయే క్రిమిసంహారక మందులు వాడాలో వివరించారు. కార్యక్రమంలో అర్షయారహమాల్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాఘవేంద్రయాదవ్, తిరుమలరెడ్డి, సీఈఓ తులసిపిళ్లై తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

చిత్తూరు, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ట్రాఫిక్ ఎస్‌ఐ బాబు వివరాల మేరకు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాకేష్(23) చిత్తూరు నగరంలో సీట్‌సెంట్రింగ్ పనులు చేసేవాడు. సోమవారం రాత్రి 10.30గంటలకు వాటర్ క్యాన్ తీసుకుని ఇరువారంవద్ద వస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాకేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని మధ్యప్రదేశ్‌కు తరలించారు.

మద్యం స్వాధీనం

చిత్తూరు, ఫిబ్రవరి 13: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఒకటవ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ విశ్వనాథరెడ్డి వివరాల మేరకు.. నగరంలోని ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో భాగ్యరాజ్(30) టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు దాడిచేసి పట్టుకుని అతడి వద్ద నుంచి 250 టెట్రాప్యాకెట్లను సీజ్ చేసినట్లు సీఐ టెలిపారు.

సారా విక్రేత అరెస్టు

గుడిపాల, ఫిబ్రవరి 13: మండలంలోని చీలాపల్లి గ్రామ సచివాలయం వెనుక వైపున అదే గ్రామానికి చెందిన జయకర్ సారా విక్రయిస్తుండగా మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. జయకర్ వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాస్టర్ల ఆత్మీయ సమావేశం

చిత్తూరు, ఫిబ్రవరి 13: ఇరువారం చర్చిలో మంగళవారం పాస్టర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని పాస్టర్లు ఘనంగా సన్మానించారు. అనంతరం నగరంలోని 43వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు గడ్డం రమణ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

యాదమరి, ఫిబ్రవరి 13: యాదమరి పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ తమిళనాడు సరిహద్దులో ఉండటం వల్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు ఎస్‌ఐతో పాటు, సిబ్బంది కొరత ఉందని సీఐ రవిశంకర్‌రెడ్డి చెప్పగా, త్వరలో నియమిస్తామన్నారు.

నేడు వసంత పంచమి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 13: స్థానిక పొన్నియమ్మగుడిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి వి.వేలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 1001 మంది విద్యార్థులచే నూతనంగా అక్షరాభ్యాసం చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులందరికీ పెన్ను, నోటు పుస్తకం, పలక, బలపాలు ఉచితంగా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగరంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ

తవణంపల్లె, ఫిబ్రవరి 13: మండలంలోని ఎగువతవణంపల్లె, పుణ్యసముద్రం పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను డ్వామా పీడీ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పనుల నాణ్యత, కూలీల హాజరును పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ వేతనాల గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీవో లలిత, ఉపాధి సిబ్బంది, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే తెలపండి

పూతలపట్టు, ఫిబ్రవరి 13: ఓటరు జాబితాలో ఏదైనా తప్పులుంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ శివరాముడు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీటీలు మహేశ్వరి, హేమగిరి, నాగరాజు (టీడీపీ), బాబు (బీఎస్పీ), జ్యోతి (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం జనసేన కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు

కార్వేటినగరం, ఫిబ్రవరి 13: కార్వేటినగరం మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి యుగంధర్, స్రవంతి రెడ్డి పాల్గొన్నారు. స్రవంతి రెడ్డి మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుస్తారని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షులు శోభన్ బాబు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వరసిద్ధుడి కల్యాణం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 13: పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం కవిటం గ్రామంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి కల్యాణాన్ని మంగళవారం కాణిపాక ఆలయ అర్చక, పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ, ధర్మ పరిషత్ వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలకు అర్చక, పండితులు విశేష పూజలు నిర్వహించి, స్వామికి యజ్ఞోపవీత ధారణ నిర్వహించిన అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామికి ముత్యాల తలంబ్రాలు పోశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి విఘ్నేష్, ఆలయ స్థానాచార్యులు ఫణికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



వరసిద్ధుడి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చక, పండితులు

శిథిలావస్థలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనం

● సొంత గ్రామంలో పెచ్చులూడి పడుతున్నా పట్టించుకోని డిప్యూటీ సీఎం ● నేలపైనే మందుల నిల్వ ● రోగులకు అందని సరైన వైద్యం

కార్వేటినగరం, ఫిబ్రవరి 13: డిప్యూటీ సీఎం నారాయణస్వామి సొంత గ్రామ పంచాయతీ కేంద్రమైన డీఎంపురంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రోగులకు సరైన చికిత్స అందక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి లోపలికి వెళ్లాలంటేనే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రోగులు ఆందోళన చెందుతున్నారు. భవనానికి మరమ్మతులు చేయించాలని డిప్యూటీ సీఎంకు పలుమార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతుంటారు. ఆస్పత్రి భవనం పైకప్పు, లోకప్పు శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే ఉరుస్తుంది. ఈభవనంలోనే నేలమీద అట్ట పెట్టెల్లో మందులను నిల్వ ఉంచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. శిథిల భవనానికి శాశ్వత మరమ్మతులు చేపట్టినట్లయితే రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించడానికి అవకాశం ఉంటుంది. శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేయించేందుకు డిప్యూటీ సీఎం, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





శిథిలావస్థకు చేరుకున్న ఆయుర్వేద ఆస్పత్రి భవనం, (ఇన్‌సెట్‌లో) పెచ్చులూడిన పైకప్పు, నేల మీదే మందులు

చంద్రబాబును గెలిపించేందుకు ప్రజలు 'సిద్ధం'

● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 13: టీడీపీ అధినేత చంద్రబాబును గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. మంగళవారం నగరంలోని 28, 44వ డివిజన్లలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం జగన్ రెడ్డిపై ప్రజలు సానుభూతితో ఓట్లు వేశారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు కావడంతోనే ప్రజలు ఒకసారి సీఎంగా అవకాశం ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి రాకముందు పాదయాత్రలో జగన్ రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పి, మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. ప్రజలు నిజాలను గ్రహించారని, రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, గురజాల జగన్మోహన్, అత్తు, షరీఫ్, రాజశేఖర్, కళ, కృపానందం, రాణి, చక్రి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

అన్న క్యాంటీన్‌కు 365 రోజులు



అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 13: అన్న క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమం మంగళవారం నాటికి 365వ రోజుకు చేరింది. స్థానిక కొంగారెడ్డిపల్లెలో గతేడాది ఫిబ్రవరి 13వ తేదీన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఇంతవరకు ఎలాంటి అడ్డంకులు లేకుండా నిరవధికంగా అన్న క్యాంటీన్‌లో అన్నదానం జరుగుతోంది. టీడీపీ నేతలు, కార్యకర్తల సహకారంతో ప్రతి రోజు అన్నదానం చేస్తున్నారు. అన్న క్యాంటీన్ సమీపంలో గ్యారేజీలు, వర్క్‌షాపులు, కళాశాలలు, చిన్న దుకాణాలు, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్ తదితరాలు ఉన్నాయి. ప్రతి రోజు అన్నదానం జరుగుతుండటంతో చాలా మంది ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటీన్ నిర్వాహకులను ప్రజలు అభినందిస్తున్నారు. మంగళవారం టీడీపీ నేత ఆర్ నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నేతలు రాజశేఖర్, దేవేందర్ నాయుడు, ఈశ్వర్, స్వామి, కంద, సాయి తదితరులు పాల్గొన్నారు.

హామీలిచ్చిన జీవోలు విడుదల చేయాలి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత నాగరాజు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 13: ఇటీవల మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె కారణంగా ప్రభుత్వం పలు హామీలిచ్చి జీవోలు విడుదల చేయకపోవడం శోచనీయమని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు అన్నారు. మంగళవారం నగరపాలక కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు, ప్రజల అవసరాలను బట్టి కార్మికులు ఆందోళనలు విరమించి నెల రోజులు కావస్తున్నా, ఇంత వరకు ప్రభుత్వం పట్టించుకోక పోవడం పలు అనుమానాలు కలుగజేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మికులకు ఇచ్చిన హామీల జీవోలను విడుదల చేయాలని, అలా లేని పక్షంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి.సి. సురేష్, జయశంకర్, వి.సి గోపీనాథ్, డి. చంద్ర, రమాదేవి, రఘు, లతా, దొరస్వామి, సుగుణ, రమణీ, భాగ్యలక్ష్మి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ మెగా జాబ్‌మేళా 20వ తేదీకి మార్పు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13: గతంలో నిర్ణయించిన మేర 15వ తేదీకి బదులు ఈ నెల 20వ తేదీకి చిత్తూరు ఆర్వీఎస్ నగర్(ఎస్వీసెట్) ఇంజనీరింగ్ కళాశాలలో రీజనల్ మెగా జాబ్ మేళా జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గతంలో ఈ మేళా విజ్ఞానసుధ కళాశాలలో నిర్వహించేందుకు వేదికగా ఎంపిక చేయగా, వేదికను ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలకు మార్పుచేశామని ఆయన పేర్కొన్నారు. ఈ మెగా జాబ్‌మేళాలో సుమారు వందకు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు పాస్, 18 - 35 సంవత్సరాల మధ్య వయస్సు కల్గిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 8465830771, 6300954441 నెంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయండి: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 13: జగనన్న హౌసింగ్ ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను సమగ్రంగా నిర్వహించాలన్నారు. కొత్తగా నమోదైన ఓట్ల నివేదికను ఈ నెల 15వ తేదీలోపు కలెక్టర్‌కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అల్‌ఫ్రెడ్, ఎంపీడీవో కృష్ణయ్య, హౌసింగ్ ఏఈ శ్రీధర్, డీటీ లోకనాథం పిళ్లై, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం వర్గం బైక్ ర్యాలీ

పాలసముద్రం, ఫిబ్రవరి 13: డిప్యూటీ సీఎం నారాయణస్వామికి అనుకూల వైసీపీ నాయకులు 'సిద్ధం' పేరుతో మంగళవారం పాలసముద్రం మండలంలోని బలిజకండ్రిగ నుంచి వయా రంగాపురం మీదుగా నరసింహాపురంవరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి డిప్యూటీ సీఎం వ్యతిరేకవర్గం నాయకులంతా దూరంగా ఉన్నారు. ఈ ర్యాలీలో జడ్పీటీసీ అన్ను, మండల వైసీపీ కన్వీనర్ తులసీరామ్ యాదవ్, నాయకులు పోలయ్య, సుమన్, గోవిందరాజులు, అరుళ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న పోటుగాని భాస్కర్

తవణంపల్లె, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు పోటుగాని భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని అరగొండ కొత్త బస్టాండు వద్ద గల అంబేడ్కర్, రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సత్రం నరసింహులును, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరిగిన డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాలన్నా, రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావాలన్నా రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి పార్టీని వీడిన నాయకులు తిరిగి పార్టీలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, పరదేశి, కుమారి, వినాయకం తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను అందిస్తున్న బీజేపీ నాయకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 13: వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లెలో మంగళవారం మన సంకల్పం వికసిత భారత్ క్యాలెండర్లను ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ ఆవిష్కరించారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా బొమ్మయ్యపల్లె పంచాయతీలోని గ్రామాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో బీజేపీ నేత కొత్తపల్లి ఆంద్రూస్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ఈ నెల 16న చేపడుతున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్షాల నేతలు కోరారు. మంగళవారం యూటీఎఫ్ కార్యాలయంలో కార్మిక సంఘాలు, వామపక్ష నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, కర్షకులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు నిమ్మకు నెరెత్తినట్లు ఉండడం దారుణమన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు సురేంద్రన్, చైతన్య, సీపీఐ నేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, ఫిబ్రవరి 13: నగరపాలక సంస్థ పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్వో, కమిషనర్ అరుణ మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన సౌకర్యాల కల్పన, చేపట్టిన పనులను పరిశీలించారు. షర్మన్ బాలికోన్నత పాఠశాల, సీకేపల్లె, ప్రభుత్వ ఐటీఐ, బ్రిడ్జి స్కూల్, గాండ్లపల్లె ఉన్నత పాఠశాలల్లోని 11 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రధానంగా తాగునీటి సరఫరా, విద్యుత్, ఫర్నీచర్, మరుగుదొడ్లను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈలు వెంకటప్రసాద్, రమణ, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

చిత్తూరు, ఫిబ్రవరి 13: ఓటరు నమోదు, సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా విచారణ చేపట్టాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ చెప్పారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో చిత్తూరు అర్బన్ పరిధిలోని బీఎల్వోలతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. తుది ఓటర్ల జాబితా విడుదలైన తరువాత స్వీకరించిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఓటరు నమోదుకు అందిన ఫారం-6, 7, 8ఎలను బీఎల్వోలు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. తగిన ధ్రువపత్రాలు, సంతకాలు తీసుకుని ఆమోదం, తిరస్కరణ కోసం సూపర్‌వైజరీ అధికారులకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఏసీపీ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.